సాక్షి జగిత్యాల

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రావణమాసం సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామితోపాటు అనుబంధ ఆలయాల్లో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది.



కళ్లకు గంతలతో నిరసన

జగిత్యాలటౌన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.




జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే.. భవిష్యత్‌కు మార్గదర్శకులు.. మనకు విద్యాబుద్ధులు నేర్పి, సన్మార్గంలో నడిచేలా చూడటంలో వారి పాత్ర కీలకం. ఏటా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధిస్తూ ఎంతో ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులు మాత్రం అక్కడే ఉండిపోతారు. తమ శిష్యులు ఉన్నత స్థాయిలో ఉండాలని మాత్రమే కోరుకునే నిస్వార్థపరులు. అది జరిగిన రోజు వారికి కలిగే ఆనందం మరెందులోనూ కలగదు. మనం ఎక్కడున్నా అలాంటి టీచర్లను గుర్తు చేసుకోవాలి. మన దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల సేవలపై 'సాక్షి' కథనం.

గురుభ్యోనమః

- భవిష్యత్‌కు మార్గదర్శకులు
- జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం టీచర్లదే
- విద్యార్థుల ఉన్నతిని కోరుకునే నిస్వార్థపరులు
- ఏ స్థాయిలో ఉన్నా వారిని గుర్తుంచుకోవాలి

ఈ ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులు ఉన్నా.. వారందరినీ తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తే. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవ

– అబ్దుల్ కలాం



ప్రభుత్వ బడికి జీవం



చార్ట్‌తో బోధిస్తున్న హెచ్‌ఎం సురేశ్

కథలాపూర్(వేములవాడ): సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2013–14లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 68 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో నమోదవగా.. 28 మందే బడికి వచ్చేవారు. ఆ సమయంలో హెచ్‌ఎంగా చింత సురేశ్ బదిలీపై వచ్చారు. పాఠశాల మూతబడే ప్రమాదముందని టీచర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, ఇంగ్లిష్ మీడియంలో విద్యనందిస్తామని ప్రచారం చేశారు. దీంతో విద్యార్థుల సంఖ్య 130కి చేరింది. టీచర్లు బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. బడికి జీవం పోశారని స్థానికులు అభినందిస్తున్నారు.



ఆకర్షణీయమైన చిత్రాలతో..

వాల్ పెయింటింగ్ ద్వారా బోధిస్తున్న సరిత

ఇల్లందకుంట(హుజూరాబాద్): బూజునూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మాతంగి సరిత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. బడి గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయించి, సులభ పద్ధతిలో పాఠాల బోధనకు చర్యలు తీసుకుంటున్నారు. వసతులు కల్పించడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత



రామడుగు(చొప్పదండి): రుద్రారం హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ కేశ.శ్రవణ్‌కుమార్ విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన చొరవతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు అవార్డులు సాధించారు. అలాగే పాఠశాలలో గత ఐదేళ్లుగా పదోతరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూస్తున్నారు.

ఉచిత శిక్షణ కార్యక్రమాలు



పాఠాలు చెబుతున్న రమేశ్

ధర్మపురి: ధర్మపురికి చెందిన కాశెట్టి రమేశ్ దోనూర్ ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మన ఊరు–మన బడి పనులను మొదటి విడతలో పూర్తి చేసి, హరితహారంలో భాగంగా బడిలో మొక్కలు నాటించారు. ఈ ఏడాది ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2006 నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా పలువురు ఉద్యోగాలు సాధించారు.

క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలు



వరినాటు వేస్తున్న అభయ్ రాజ్

రాయికల్(జగిత్యాల): రామారావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అభయ్‌రాజ్ విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేశారు. ప్రస్తుతం 50 మంది ఉన్నారు. పిల్లలను క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలకు తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులో 25 డిజిటల్ పాఠాలకు రూపకల్పన చేశారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోనున్నారు.

'బడిబాట'లో విస్తృత ప్రచారం



పాఠాలు బోధిస్తున్న శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ యేబూషి శ్రీనివాస్ బాడిబాట కార్యక్రమంలో విస్తృత ప్రచారం చేశారు. విద్యార్థుల సంఖ్యను 65 నుంచి 117కు పెంచారు. మన ఊరు–మన బడి కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులకు ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. శ్రీనివాస్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

తెలుగు భాషకు ప్రాధాన్యం



పాఠాలు బోధిస్తున్న బిందు మాధవి

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలుగు భాషను బతికించేందుకు బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ బిందు మాధవి కృషి చేస్తున్నారు. విద్యార్థులు తెలుగులో 10 జీపీఏ సాధించడమే ఇందుకు నిదర్శనం. తెలుగు వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ఇక్కడి విద్యార్థులు రాణించారు. అనేక పద్యాలు రాశారు. బిందు మాధవి సేవలను గుర్తించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్



పాఠాలు బోధిస్తున్న పవన్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ హైస్కూల్ సోషల్ టీచర్ ఆర్.పవన్‌కుమార్ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. రాష్ట్రస్థాయి సోషల్ స్టడీస్ ప్రతిభా పరీక్షలో ఈ స్కూల్ విద్యార్థి మూడో ర్యాంక్ సాధించాడు. జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం సాధించారు. పవన్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): వడ్కాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి చిన్నారులకు సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. స్కూల్లో చేరిన చిన్నారులకు పాఠశాల ఆవరణలోనే అక్షరాభ్యాసం చేయిస్తున్నారు. బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ముందు వరుసలో నిలిచారు.

బడిని బతికించారు



పాఠాలు చెబుతున్న సుధాకర్

మెట్‌పల్లి(కోరుట్ల): సింగపూర్ ప్రాథమిక పాఠశాల 2014లో మూతపడింది. ఇక్కడి ఉపాధ్యాయుడు సుధాకర్ డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమ విద్యను ప్రవేశపెట్టడంతో గతేడాది పాఠశాల తెరుచుకుంది. ఆయన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడంతో వారు అంగీకరించారు. ప్రస్తుతం 15 మంది చదువుతున్నారు.

జగ్గయ్యపల్లి ప్రాథమిక పాఠశాల..



విద్యాబోధన చేస్తున్న షబానా

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆరేళ్లు మూతపడిన మల్యాల జగ్గయ్యపల్లె పాఠశాలను గతేడాది తిరిగి ప్రారంభించారు. టీచర్ షబానా గ్రామస్తులతో మాట్లాడి, ఒప్పించడంతో 5 తరగతులు 11 మంది విద్యార్థులతో కొనసాగుతున్నాయి. ఆమె ఒక్కరే ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు బోధిస్తున్నారు. ఆటపాటలతో బోధన చేస్తూ మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు.

స్కూల్‌ను తెరిపించి



పిల్లలతో ఉపాధ్యాయురాలు మమత

సైదాపూర్: మండల కేంద్రానికి చెందిన మారవేని మమత అమ్మనగుర్తి పీఎస్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. రూ.20 వేలతో ఎల్‌ఈడీ టీవీ, రూ.5 వేలతో కుర్చీలు సమకూర్చారు. వ్యాయామం, ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. టీఎల్‌ఎం 2022–23కు మండల స్థాయిలో పాఠశాలకు ఉత్తమ అవార్డు వచ్చింది. మమత కృషికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వరించింది.

విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం



శేఖర్ మల్లేశం సదానందం భాస్కర్

సిరిసిల్లఎడ్యుకేషన్/ఇల్లంతకుంట/ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ పాఠశాల ఇంగ్లిష్ టీచర్ గొట్టిముక్కల శేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాల నుంచి 15 మంది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు, నలుగురు నేషనల్ లెవెల్ ఫుట్‌బాల్ పోటీలను ఎంపికవడంలో శేఖర్ కృషి ఎంతో ఉంది. పిల్లలను విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని జవారీపేట ప్రాథమిక పాఠశాల టీచర్ అరుకుటి మల్లేశం శిథిలావస్థలో ఉన్న బడిని బాగు చేయించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రామోజీపేట పాఠశాల టీచర్ రెవోజు సదానందం రెగ్యులర్ విద్యతోపాటు విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించడానికి కృషి చేశారు. డిజిటల్ బోధనకు రాత్రింబవళ్లు శ్రమించి యూట్యూబ్ చానల్ ద్వారా వీడియో పాఠాలు రూపొందించగా మంత్రి కేటీఆర్ అభినందించారు. సదానందం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నాయిని భాస్కర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పదేళ్లుగా ఆయన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు.

అత్యుత్తమ శిక్షణ



క్రీడలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): వావిలాల జెడ్పీహెచ్‌ఎస్ వ్యాయమ ఉపాధ్యాయుడు జిట్టబోయిన శ్రీనివాస్ విద్యార్థులకు క్రీడల్లో అత్యుత్తమ శిక్షణనిస్తున్నారు. దీంతో జిల్లా స్థాయి ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్నారు. ఆయన జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ప్రొజెక్టర్ ద్వారా బోధన



మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల టీచర్ ఆరెపల్లి జయప్రద గౌతమి ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఆమెను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.

'పది'లో ఉత్తీర్ణతకు ప్రణాళికలు



పదోతరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలు రూపొందించి, సక్సెస్ అయ్యాం. గతేడాది ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. – పి.కృష్ణగోపాల్, హెచ్‌ఎం

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దుతున్నాం. 2022–23 ఏడాది పదోతరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం

– పి.వేణుగోపాల్‌రావు, గణిత టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, ఎలగందుల

క్రీడల్లో రాణించేలా..



పిల్లలను క్రీడల్లో భాగస్వాములను చేస్తున్నాం. చాలామంది కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో రాణించారు. పలువురు కానిస్టేబుల్, ఎస్సై, పీఈటీ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

– సత్తినేని రమేశ్‌కుమార్, పీఈటీ

హ్యాండ్‌బాల్ క్రీడలో పతకాలు



హ్యాండ్‌బాల్ క్రీడకు కేరాఫ్‌గా గుల్లకోటను తీర్చిదిద్దాం. నా కెరీర్‌లో ఆరుగురు విద్యార్థులు జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం, నలుగురు సాయ్ అకాడమీకి ఎంపికవడం మర్చిపోలేను.– జి.శ్రీనివాస్, పీఈటీ

– సప్తగిరికాలనీ(కరీంనగర్)

సమయం.. ఆసన్నం

- జిల్లాలో యూరియా కొరత
- అవసరానికి మించి తీసుకెళ్తున్న రైతులు
- అదను దాటుతుందని అన్నదాతల ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఈవానా కాలంలో సాగుచేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలకు రెండోసారి యూరియా వేయాల్సి ఉంది. ఈ సమయంలో తలెత్తిన కొరత రైతులను వేధిస్తోంది. యూరియా కోసం సింగిల్‌విండో కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎక్కడో ఓచోట లోడ్ వచ్చిందని తెలియగానే వందల మంది రైతులు అక్కడకు పరుగులు పెడుతున్నారు. నాలుగైదు రోజులకోసారి ఇలా వచ్చిన యూరియా 10 నిమిషాల్లోనే ఖాళీ అవుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ఇప్పుడు పంటకు యూరియా వేయడం అత్యవసరమని, దానికొరత తీర్చాలని జిల్లా రైతుఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సాగు విస్తీర్ణం 4.50 లక్షల ఎకరాలు..

- ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా దాదాపు 4.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగైనట్లు అధికారుల అంచనా.
- అత్యధికంగా 3.10 లక్షల ఎకరాల్లో వరి, 41 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 20 వేల ఎకరాల్లో పత్తి, 2వేల ఎకరాల్లో సోయాబిన్, 5వేల ఎకరాల్లో కంది, ఇతర మిగతా విస్తీర్ణంలో ఇతర పంటలు పండిస్తున్నారు.

పొట్టదశలో వరి..

- ప్రస్తుతం వరి పొట్టదశకు చేరుకుంది. తొలిదశలో నేలలో డీఏపీ వేసిన రైతులు.. రెండోసారి యూరియా వేస్తున్నారు. ఈనెల చివరివారం లేదా.. అక్టోబర్ తొలివారంలో వరి గింజదశకు చేరుకుంటుంది. ఈ సమయంలో కూడా మూడోసారి పొటాష్‌తో కలిపి యూరియా వేస్తారు. మొక్కజొన్న ప్రస్తుతం పీచుదశకు చేరింది. ఇప్పుడు దీనికి కూడా యూరియా అవసరం. తమ ఆర్థిక పరిస్థితులను బట్టి రైతులు యూరియా నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. కానీ, సమయం ఆసన్నం కావడంతో ఒకేసారి రైతులు సింగిల్‌విండోలు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తుండడంతో కృత్రిమ కొరత ఏర్పడుతోందని అధికారులు వివరిస్తున్నారు.

కేటాయింపులు 40,797 మెట్రిక్ టన్నులు..

- వానాకాలం సీజన్ కోసం ప్రభుత్వం జిల్లాకు 40,797 మెట్రిక్ టన్నులు కేటాయించింది.
- ఈమేరకు జిల్లాకు ప్రతినెలా యూరియా సరఫరా అవుతోంది.
- ఇప్పటివరకు 32 మెటన్నులు రావాల్సి ఉండగా, 26,500 మెట్రిక్ టన్నేలే సరఫరా అయ్యింది.
- మిగిలిన కేటాయింపుల్లో 16 వేల మెట్రిక్ టన్నుల వరకు మార్క్‌ఫెడ్ ద్వారా సింగిల్‌విండో కేంద్రాలకు రాగా, ఇంకో 16 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేట్ వ్యాపారులకు కేటాయించారు.
- ప్రస్తుతం జిల్లాలో ఏ గోదాములోనూ యూరియా నిల్వలు లేవు.
- గతంలో రైల్వేవ్యాగన్ల ద్వారా నేరుగా జగిత్యాలకు యూరియా సరఫరా అయ్యేది.
- ఇప్పుడు కరీంనగర్‌లోని గోదాముల నుంచి లారీల్లో తీసుకు వస్తున్నారు.
- అయితే, డిమాండ్‌కు అనుగుణంగా కేటాయింపులు చేయాల్సిన అధికారులు.. సింగిల్‌విండోలకు సగం, మిగతా సగం ప్రైవేట్ వ్యాపారులకు కేటాయిస్తున్నారు.
- దీంతో కొందరు వ్యాపారులు కొరతను సాకుగా చూపి రైతుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.
- ఎరువుల సరఫరా బాధ్యతను మార్క్‌ఫెడ్ తీసుకుని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు మండలాలకు కేటాయిస్తున్నారు.
- అయితే, సింగిల్‌విండో చైర్మన్లు అధికారులపై ఒత్తిడి పెంచడంతో కొన్ని సొసైటీలకే యూరియా అధికంగా తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అవసరానికి మించి తీసుకెళ్తున్నారు..

పంటలకు మూడోసారి అవసరమైన యూరియాను కొందరు రైతులు ఇప్పుడే తీసుకెళ్లి, ఇళ్లలో నిల్వ చేస్తున్నారు. దీనికితోడు ఎకరాకు ఒకబస్తా వేయాల్సి ఉంటే.. కొందరు రెండుబస్తాల వరకు వేస్తున్నారు. దీంతో నెలవారీ కోటా యూరియా ప్రస్తుత దశకు సరిపోవడం లేదని అధికారులు వివరిస్తున్నారు.

దొరకడం లేదు

నాకున్న రెండెకరాల్లో వరి, మరో ఎకరంలో మొక్కజొన్న పండిస్తున్న. ఇప్పుడు యూరియా వేయాలి. సింగిల్‌విండోల్లో లేదు. వ్యాపారులు బస్తాపై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా తీసుకుంటున్నరు.

– కొట్టాల మోహన్‌రెడ్డి, రైతు, లక్ష్మీపూర్

కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. కేటాయించిన నిల్వ ప్రకారం ప్రతినెలా సరఫరా అవుతున్నాయి. కొందరు రైతులు మూడోసారి వేయాల్సిన యూరియాను ఇప్పుడే తీసుకెళ్తున్నారు. దీంతో కృత్రిమ కొరత ఏర్పడింది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: కేంద్రప్రభుత్వ పథకాలపై జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తున్నారని, వీధి వ్యాపారులు, కుటుంబ సభ్యులు లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రగతి స్వనిధి సే సమృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, నైపుణ్యం లేని కార్మికుల నమోదు, పీఎం శ్రమయోగి మందన్ యోజన, వన్ నేషన్ వన్ రేషన్‌కార్డు, జననీ సురక్ష యోజన, పీఎం మాతృవందన యోజన తదితర పథకాల్లో ప్రయోజనం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోప నివారణ లక్ష్యం

గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం నివారణ లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. మహిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, పౌష్టికాహార లోపం నివారణ కోసం ఈనెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. రక్తహీనత, డయేరియా, తాగునీరు, పారిశుధ్యం నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో జన ఆందోళన్ చేపట్టాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత తదితర కార్యక్రమాల ద్వారా పౌష్టికాహారం తీసుకోవడం, మిల్లెట్స్ ప్రాముఖ్యత, పోషణ వాటికలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోరుట్ల ముత్యాలవాడలో వరదలో చిక్కుకున్న కారు

వాన కష్టాలు

కోరుట్ల/కోరుట్లరూరల్/మల్లాపూర్/రాయికల్: జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. వరదలో ఒకరు గల్లంతు కాగా, గోడ కూలి ముగ్గురికి యాలయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. రోడ్లు తెగి పోయా యి. పంటలు నీట మునిగాయి. రాకపోకలు స్తంభించాయి.



రాయికల్: రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు



కోరుట్ల: జలమయమైన కాలనీ



సంగెం.. యెఖీన్‌పూర్ మధ్య పెద్దవాగు ఉధృతి

క్లుప్తంగా

వరదలో మత్స్యకారుడి గల్లంతు


విద్యాసాగర్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భీష్మనగర్‌కు చెందిన మత్స్యకారుడు కోండ్ర విద్యాసాగర్ (44) తిప్పన్నపేట గ్రామ శివారులోని గచ్చుమాట్ వద్ద వరదలో గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం విద్యాసాగర్ తిప్పన్నపేట శివారులోని గచ్చుమాట్ వద్ద చేపల వేటకు వెళ్లగా కాలు జారి వరదలో కొట్టుకుపోయాడు. గాలింపు చర్యలు చేపట్టినా సోమవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. అతడి జాడ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు హైదర్‌పల్లి, గుల్లపేట, అనంతారం, తక్కళ్లపల్లి, యశ్వంతరావుపేట వరకు గాలింపు చర్యలు చేపట్టారు.

కనీస వేతనం అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

జగిత్యాలటౌన్: గర్భిణుల ఆరోగ్యంతో పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక సంక్షేమ పథకాలను విజయవంతం చేయడంలో సేవలందిస్తున్న తమకు పారితోషికం స్థానంలో కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. గర్భిణికి ఇంత అంటూ ఇస్తున్న పారితోషికం ఏ మూలకూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్

జగిత్యాలక్రైం:జిల్లాలో ఈనెల 30వ తేదీ వరకు పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా పరిధిలో పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఏదైనా కార్యక్రమం నిర్వహణకు ముందస్తుగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. వివిధ కారణాలతో ర్యాలీలు, కార్యాలయాలు మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాలు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

జగిత్యాల: సర్వశిక్ష ఉద్యోగులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. తెలంగాణలో శ్రమదోపిడీ చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. తిరుపతి, చైతన్య, అష్రాఫ్, నరేశ్, కోటేశ్ పాల్గొన్నారు.

బీసీలకు పదవులు కేటాయించాలి

రాష్ట్రంలో బీసీలకు పదవులు కేటాయించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. అన్ని పదవులు అగ్ర కులాల చేతుల్లో ఉన్నాయని ఆరోపించారు. దళితులకు సీఎం పదవి ఇవ్వాలని, 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

• ప్రజావాణికి అభాగ్యుల వినతి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా 12 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్‌బాషా.. అనంతరం మాట్లాడారు. ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి

జగిత్యాల: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండి అంతకన్నా ఎక్కువ వయస్సు గల వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫాం- 6 బీఎల్వోలకు అందజేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. ఫాం-6 అందజేయకున్నా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు, అలాగే ఫాం- 8 సమర్పించేందుకు ఈనెల 19 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 1950 సంప్రదించాలని కోరారు.

బడ్జెట్ విడుదల చేయాలి



ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఎంపికయ్యాం. రుణాలు మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడం లేదు. బయట ఎక్కడా పనులు లభించక ఇబ్బందులు పడుతున్నాం. బడ్జెట్ విడుదల చేసి ఆదుకోవాలి.

– ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన అభ్యర్థులు

శ్మశానవాటికను కాపాడండి



జగిత్యాల పట్టణానికి ఆనుకుని ఉన్న మోతె శ్మశానవాటికకు ప్రభుత్వ రికార్డుల ప్రకారం 557 సర్వే నంబరులో 2.30ఎకరాలు ఉంది. అందులో కొంత ఆక్రమించారు. దీంతో అది ప్రస్తుతం 20 గుంటలకే పరి మితమైంది. సర్వే జరిపి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలి. హద్దులు నిర్ణయించండి.

– వేముల సంతోశ్, హిందూ వాహిని ప్రతినిధి

ఏడో తేదీ వరకు భారీ వర్షాలు

• ఉమ్మడి జిల్లాకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురువనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఈనెల 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. ఆమేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తాయని, సిరిసిల్లలో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం రాజన్న సిరిసిల్ల, జగిత్యాలలో అతిభారీ వర్షాలు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని వివరించింది. గురువారం మాత్రం ఎల్లో అలర్ట్ ఉంటుందన్నారు. ఆరోజు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

రేషన్ బియ్యం పక్కదారిపై కేంద్రమంత్రికి ఫిర్యాదు


మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా పౌర సరఫరాల అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డిని వారు కలిసి బియ్యం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం దుర్వినియోగం కాకుండా చూడాలని కలెక్టర్‌ను ఫోన్ ద్వారా కిషన్‌రెడ్డి కోరినట్లు నాయకులు తెలిపారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, లింగంపేట శ్రీనివాస్, సీపెల్లి రవీందర్, గుర్రం రాము ఉన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయాలి

• మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల: రుణమాఫీ పొందని రైతులందరికీ కొత్త రుణాలు మంజూరు చేయాలని, రుణమాఫీ డబ్బులు రైతుల చేతికి వెళ్లాలనేది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రెండుసార్లు రుణమాఫీ పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. రుణమాఫీ సమస్యల పరిష్కారానికి బ్యాంకులు రాష్ట్రస్థాయిలో గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, రానున్న మూడు రోజుల్లో భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలాశయాలు చెరువుల నీటిమట్టాలను ఇరిగేషన్ ఇంజినీర్లు కనిపెట్టుకోవాలన్నారు. రైతు రుణమాఫీ, ఆసరా పింఛన్లు, కారుణ్య నియామకాలు లక్ష్యం పూర్తి చేసే దిశగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

• మంత్రి కొప్పుల ఈశ్వర్


పాదయాత్ర చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీ వెంకటేశ్‌నేత

వెల్గటూర్(ధర్మపురి): ఆరుసార్లు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపినందుకు నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే అంతకు మించి అభివృద్ధి చేస్తానని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగదేవుపేటలో ఆయన సోమవారం ప్రజాఆశీర్వాద పాదయాత్ర ప్రారంభించారు. కుమ్మరిపల్లి, వెల్గటూర్‌లో కొనసాగించారు. జగదేవుపేటలో రూ.13 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీ వెంకటేశ్‌నేతతో కలిసి ప్రారంభించారు. రూ.3.60 కోట్లు వెచ్చించి వెలటూర్ – జగదేవుపేట మధ్య నిర్మించిన హైలెవల్ వంతెన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కుల సంఘ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు నిర్మించామని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కూనమల్ల లక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేట్‌స్థాయిలో ఆస్పత్రులు


నూతన ఆస్పత్రిని ప్రారంభిస్తున్న చైర్మన్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తోందని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జంబిగద్దె ప్రాంతంలో దీక్షిత న్యూరో ఆస్పత్రిని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా అయిన అనంతరం అన్ని విభాగాలకు చెందిన ఆస్పత్రులు జగిత్యాలలో ఏర్పడ్డాయని, సుదూర ప్రాంతాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్, ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు, నిర్వాహకులు డాక్టర్ సాకేత్ రెడ్డి, బిగ్ జ్ఞానేశ్వర్, మురళీ, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం ధాటికి కూలిన గోడ



కథలాపూర్(వేములవాడ): మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో బత్తుల రాజుకు చెందిన గుడిసె గోడ వర్షం ధాటికి సోమవారం సాయంత్రం కూలింది. ఈ ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రాజు నిరుపేద కావడంతో సిమెంట్ ఇటుకలతో నిర్మించిన గుడిసెలో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుడిసె గోడ తడిసి కూలిపోయింది. గోడ పక్కనే ఉన్న రాజుతోపాటు అతడి ఇద్దరు కూతుళ్లు సౌజన్య, సృజనకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి సర్పంచ్ గడీల గంగ ప్రసాద్, యువకులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ముగ్గురికి స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. బాధిత కుటుంబం తాత్కాలికంగా వారి బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నారు.

నకిలీ కుట్టు మెషిన్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కోరుట్ల: పట్టణంలో ఉషా కంపెనీ పేరుతో నకిలీ కుట్టు మెషిన్లు విక్రయిస్తున్న కటుకం శివకుమార్‌పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఉషా కంపెనీ డీలర్ ఫిర్యాదు మేరకు శివకుమార్ వద్ద తనిఖీ చేయగా 15 నకిలీ ఉషా కుట్టు మెషిన్లు దొరికాయి. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలో ఇటీవల నిర్మించిన ఆరె కటిక కుల సంఘ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కుల సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్, ఆరెకటిక సంఘం అధ్యక్షుడు గొడికె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): పేషెంట్లకు అందిస్తున్న వైద్యసేవలు, పరీక్షలు, శిబిరాల రికార్డులను సిద్ధం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. నూకపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈనెలలో నేషనల్ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తుందన్నారు. ఈ మేరకు వైద్య సేవలను తనిఖీ చేస్తారని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

'లవ్ జిహాదీలను శిక్షించాలి'


నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: లవ్‌జిహాద్‌కు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూపరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. లవ్ జిహాద్ పేరిట హిందూ యువతులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం స్థానిక తహసీల్ చౌరస్తాలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ, జిల్లాలోని కోరుట్లలో జరిగిన ఘటనకు కారకుడైన ఉమర్ షేక్ సుల్తాన్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో లవ్‌జిహాద్‌కు వ్యతిరేకంగా చట్టం చేసి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు అరుణ్‌కుమార్, నరేందర్‌రాజు, అక్కినపెల్లి కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆకుకూరలు తినాలి


మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

జగిత్యాల: గర్భిణులు ఆకుకూరలు తినాలని సీడీపీవో వీరలక్ష్మి సూచించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా స్థానిక బీరయ్యగుడి ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భవతులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, రజిత, విజయ, పద్మ, హారిక, కల్యాణి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జగిత్యాల: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 28మంది ఉపాధ్యాయులను జిల్లాస్థాయికి ఎంపికచేశారు. వివిధ కేటగిరీల్లో వీరిని ఎంపికచేసినట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఎంపికైన వారు మంగళవారం సాయంత్రం 5గంటలకు స్థానిక పొన్నాల గార్డెన్స్‌లో హాజరు కావాలని ఆయన కోరారు.

పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులు

పేరు	స్కూల్	మండలం
గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు		
గంగుల నరేశం	జెడ్పీహెచ్ఎస్, జోగినిపల్లి	కోరుట్ల
జి.రాజగోవిందరెడ్డి	జెడ్పీహెచ్ఎస్, రామన్నపేట	మల్యాల
జి.జ్యోతి	జెడ్పీహెచ్ఎస్, గర్ల్స్, మల్యాల	మల్యాల
ఎస్.మల్లేశం	జెడ్పీహెచ్ఎస్, గర్ల్స్, కొడిమ్యాల	కొడిమ్యాల
స్కూల్ అసిస్టెంట్లు		
జి.వెంకటరమణ	మోడల్ స్కూల్, గొల్లపల్లి	గొల్లపల్లి
పల్లె హరిప్రియ	మోడల్ స్కూల్, గొల్లపల్లి	గొల్లపల్లి
ఎండీ ఫసియొద్దీన్	జెడ్పీహెచ్ఎస్, పైడిమడుగు	కోరుట్ల
గుగ్గిళ్ల నర్సయ్య	జెడ్పీహెచ్ఎస్, చల్‌గల్	జగిత్యాలరూరల్
గండి రాజయ్య	జెడ్పీహెచ్ఎస్, కట్లకుంట	మేడిపల్లి
సీహెచ్ శరత్‌బాబు	జెడ్పీహెచ్ఎస్, రేచపల్లి	సారంగాపూర్
ఎం.రవీందర్	జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంనగర్	గొల్లపల్లి
ఎస్.వెంకటరమణ	జెడ్పీహెచ్ఎస్, సంగంపల్లి	జగిత్యాలరూరల్
ఎం.స్వప్న	జెడ్పీహెచ్ఎస్, వేములకుర్తి	ఇబ్రహీంపట్నం
బి.జనార్దన్	జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంనగర్	గొల్లపల్లి
మహ్మద్ అబ్దుల్ సలీం	జెడ్పీహెచ్ఎస్, ఖాజీపుర	కోరుట్ల
ఎండీ హాజీం	జెడ్పీహెచ్ఎస్, సాతారం	మల్లాపూర్
మహ్మద్ ఖలీద్‌పాషా	జెడ్పీహెచ్ఎస్, బొమ్మెన	కథలాపూర్
ఎస్జీటీలు		
ఎస్.రాజేశ్	ఎంపీపీఎస్, రేకులపల్లి	బీర్‌పూర్
బి.శ్రీనివాస్‌రావు	ఎంపీపీఎస్, బూర్గుపల్లి	ధర్మపురి
ఎం.శ్రీనివాస్	ఎంపీపీఎస్, గుల్లకోట	ఎండపల్లి
జి.ప్రవీణ్‌కుమార్	ఎంపీపీఎస్, ఫకీర్‌కొండాపూర్	ఇబ్రహీంపట్నం
లక్కడి శ్రీనివాస్	ఎంపీపీఎస్, రేగుంట	మల్లాపూర్
శైని గంగయమున	ఎంపీపీఎస్, పోరుమల్ల	మేడిపల్లి
మాచర్ల మహేశ్	ఎంపీపీఎస్, కొత్తపేట	రాయికల్
సీహెచ్ సత్యనారాయణ	జెడ్పీహెచ్ఎస్, యశ్వంతరావుపేట	బుగ్గారం
బోగ శివప్రసాద్	జెడ్పీహెచ్ఎస్, అర్పపల్లి	సారంగాపూర్
పి.లక్ష్మీనాగయ్య	జెడ్పీహెచ్ఎస్, రామన్నపేట	మల్యాల
సిరికొండ వేణు	జెడ్పీహెచ్ఎస్, బుగ్గారం	బుగ్గారం

జీవన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదు

• కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

జగిత్యాలటౌన్: పేదల పక్షపాతి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకోసం భూసేకరణ చేసి ఇళ్లు కేటాయించింది ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు మీ సొంత సొమ్ముతో మాఫీ చేశారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకే దక్కుతున్నాయని విమర్శించారు. దళితుల భూమి లాక్కుని మంత్రి కొప్పుల ఈశ్వర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు మంత్రి కొప్పుల సిద్ధమా అని సవాల్ విసిరారు. నాలుగేళ్లుగా నాన్చి తెలంగాణ ప్రభుత్వం చేసింది రుణమాఫీ కాదని, కేవలం వడ్డీ మాఫీ మాత్రమేనన్నారు. ఎమ్మెల్యే, మంత్రి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, నక్క జీవన్, పుప్పాల అశోక్, మన్సూర్, గుండ మధు, బొల్లి శేఖర్, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

దుబ్బరాజన్నకు ప్రత్యేక పూజలు


స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు


విరాళం అందజేస్తున్న భక్తులు

సారంగాపూర్(జగిత్యాల): శ్రావణమాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కులు, తలనీలాలు, నిలువెత్తు బంగారం సమర్పణతో పాటు గండదీపం, గజాశూలం తదితర మొక్కలు తీర్చుకున్నారు. భారీ వర్షాలతో పాటు కోనాపూర్ వద్ద అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో భక్తుల సంఖ్య తక్కువగా ఉంది. కాగా స్వామివారిని ఎంపీపీ కోల జమున శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని అభిషేకం నిర్వహించారు. ఆలయ ఈవో అనూష, చైర్మన్ పొరండ్ల శంకరయ్య, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాతల విరాళం

దుబ్బరాజన్న ఆలయ ఆవరణలో రాజగోపురం నిర్మాణానికి పలువురు విరాళం అందజేశారు. పెంబట్లకు చెందిన పాంపర్తి రాజశేఖర్ రూ.25,116, గోదావరిఖనికి చెందిన గంద్ర రామారావు రూ.25,116, జగిత్యాల పట్టణానికి చెందిన మర్యాల వెంకటేశం రూ.10,116 విరాళంగా అందజేశారు.

రెగ్యులర్ చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ జేఏసీ నాయకులు

జగిత్యాలటౌన్: వివిధ హోదాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తమ సమస్యలపై జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. విద్యాశాఖ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడి అరెస్ట్

బుగ్గారం(ధర్మపురి):స్థానిక గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో కొంత కాలంగా పోరాడుతున్న టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇదేవిషయంపై గ్రామస్తులతో కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన అక్కడే అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అవినీతిపరులను మంత్రి ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ఈ విషయంలో సర్పంచ్‌ను సస్పెండ్ చేయకుంటే మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌర హక్కుల సంఘం నాయకులు గంగారెడ్డిని ఠాణాలో పరామర్శించి మద్దతు తెలిపారు.